సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



పోలీసుల కక్ష సాధింపు!
పులివెందుల నియోజకవర్గంలో కొందరు పోలీసు అధికారుల పనితీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. -8లో



బంగారు దుకాణంలో చోరీ
మైదుకూరు పట్టణంలో మిట్టా జ్యువెలర్స్ దుకాణంలో బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అర్బన్ సీఐ సయ్యద్ హాషం వివరాలు వెల్లడించారు. -8లో

గరిష్టం/కనిష్టం
32.4/24.9

వాతావరణం
జిల్లాలో సోమవారం 24.9 – 32.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

డీటీసీగా చంద్రశేఖర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌గా చంద్రశేఖర్ రెడ్డి నియమితుల య్యారు. ఈయన శ్రీకాకుళం డీటీసీ కార్యాల యంలో పని చేస్తూ బదిలీపై జిల్లాకు రాను న్నారు. ఇక్కడ డీటీసీగా పని చేస్తున్న ఈ. మీరా ప్రసాద్ విజయవాడకు బదిలీ అయ్యారు. నూతన డీటీసీ రెండు, మూడు రోజుల్లో బాధ్య తలు స్వీకరించే అవకాశం ఉంది.

రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేప ట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లా డారు. కూటమి ప్రభుత్వ నేతలు తమ బాధ్యత లను కూడా ప్రభుత్వ విజయాలుగా చూపిస్తుం డడం దారుణమన్నారు. ఈ కూటమి ప్రభుత్వం తమ వాగ్దానాలు గాలికి వదిలేసి ప్రజలను ఏమారుస్తోందని మండిపడ్డారు. ఈనెల 25వ తేదీ ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట థాళీ బజావో పేరిట నిర సన చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్య క్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ విభాగాలు అయిన ఎన్. ఎస్. యు. ఐ. యువ జన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కడప జోన్ ఈడీగా చంద్రశేఖర్



కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దం డే ఉత్తర్వులు జారీ చేశారు. కడప ఈడీగా పని చేస్తున్న గిడుగు వెంకటేశ్వరరావును విజయ వాడ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకో వాలని ఆదేశించారు. ప్రస్తుతం విజయవాడ లోని ప్రధాన కార్యాలయంలో ఆపరేషన్స్ ఈడీగా పనిచేస్తున్న చంద్రశేఖర్ త్వరలో కడప జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టనున్నారు.


ఆర్టీసీ డీఎంల బదిలీలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజి యన్ పరిధిలోని వివిధ డిపోల్లో పనిచేస్తున్న డిపో మేనేజర్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికా రులు ఉత్తర్వులు జారీ చేశారు. బద్వేలు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జె.శ్రీనివాసరావును అనంతపురం జిల్లా రాయదుర్గంకు బదిలీ చేశారు. నందికొట్కూరు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న కె.శ్రీరామ్‌కుమార్‌ను మైదు కూరుకు బదిలీ చేశారు. కడప జోన్ కార్గో ఏటీఎంగా పనిచేస్తున్న కె.హరిని చిత్తూరు డిప్యూటీ సీఎంఈగా అదనపు బాధ్యతలను అప్పగించారు. కడప జోనల్ వర్క్‌షాప్‌లో పని చేస్తున్న వి.హరినాథబాబును కర్నూలు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా బదిలీ చేశారు. అలాగే కంట్రోల్ ఆఫ్ స్టోర్స్‌గా ఉన్న ఎస్ఎండీ రఫీని కడప వర్క్‌షాప్‌లో సీఎంఎస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని బాల సదనాలలో వివిధ పోస్టుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు ఎంపికైన వారి జాబితా వెబ్‌సైట్‌లో ఉంచామని డీసీపీఓ సుభాష్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్, ఎడ్యుకేటర్, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్, హెల్పర్, హౌస్ కీపర్, కుక్, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్ పోస్టు లకు సంబంధించి అర్హులైన/అనర్హులైన అభ్య ర్థుల వివరాలను పోస్టుల వారీగా కడప.ఏపీ.జీ ఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్ పోస్టుకు ఈనెల 24వ తేది సాయంత్రం 5 గంటల్లోపు, మిగిలిన పోస్టులకు 25వ తేది సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరే ట్‌లోని డి-బ్లాకులో ఉన్న ఐసీడీఎస్ కార్యా లయ పనివేళల్లో తెలియజేయాలన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్స్ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్: ఎన్నికల సమయంలో కూటమి నేతలు వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవే ర్చాలని వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయ కులు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఈ మేర కు సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.వి.నర సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమ యంలో వలంటీర్లను తొలగించమని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆ హామీని పట్టిం చుకోకపోవడం దారుణమన్నారు. వలంటీర్లకు న్యాయం చేయకుంటే ఆందోళనలకు సిద్ధమవు తామని హెచ్చరించారు.


కాటేసిన కరువు

కరువు మరోమారు జిల్లాను కబళించింది. ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగ, కంది, మినుము, కొర్ర, పత్తి వంటి పంటలు నిలువునా ఎండిపో యాయి. పలు గ్రామాల్లో ఎండిన పంట లను రైతులు దున్నేస్తున్నారు. వ్యవసాయ బోర్లలో నీటి మట్టం వేగంగా పడిపోతుం డడంతో వరి, ఉల్లి, చామంతి, తదితర పం టలు సాగు చేసిన రైతులు ఆందోళన చెం దుతున్నారు. వరదలే కాదు....కరువులు కూడా విపత్తేనని భావించని 'ఇదేం మంచి ప్రభుత్వ'మని రైతులు ప్రశ్నిస్తున్నారు.

- 14.1 శాతం వర్షపాత లోటు
- పలు మండలాల్లో డ్రై స్పెల్స్
- సగానికి పైగా పడిపోయిన సాగు
- 'కరువు' ప్రకటించి ఆదుకోవాలంటున్న రైతులు



ఎండిపోయిన మినుము పంటను చూపుతున్న రైతులు



కడప సెవెన్‌రోడ్స్: అన్నదాతలకు కరువు కాటేసింది. వర్షపు రోజుల సంఖ్య క్రమం గా తగ్గిపోతున్న జాబితాలో ఉమ్మ డి కడప జిల్లా ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రెం డేళ్లకోమారు జిల్లా కరువు కాటుకు గురి కావాల్సి వస్తోంది. అయిదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే 2019, 2023 సంవత్స రాల్లో తీవ్ర కరువు పరిస్థితులు సంభవిం చాయి. ఈ యేడు రుతు పవనాలు అనుకూలించి వర్షపాతం సగటుకు మించి నమోదవుతుందని ఇండియా మెట్రాలజికల్ డిపార్టుమెంటు తొలుత విడుదల చేసిన ప్రకటనతో జిల్లా రైతులు ఎంతో సంతోషిం చారు. జూన్‌లో ఊరించిన వర్షాలు .. ఆ తర్వాత విక టించడంతో రైతుల ఆశలు ఆవిరైపోయాయి. కరువు కారణంగా పంటలు ఎండిపోవడంతో మినుముపై ఎకరాకు రూ. 20 వేలు, పత్తిపై రూ. 20 వేలు, కొర్రపై రూ. 15 వేలు, వేరుశనగపై రూ. 25 వేలు ఇలా పలు పంటలపై పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోవడంతో రైతులు దిగాలుపడ్డారు. అప్పు లపాలు కావడంతో రబీ పంటలు కూడా సాగు చేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షపాతం వివరాలు పరిశీలిస్తే....

- జిల్లాలో జూన్ నుంచి ఇప్పటివరకు 361.3 మి.మీ. సాధారణ వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా, 310.2 మి.మీ. మాత్రమే కురిసింది. అం టే 14.1 శాతం వర్షపాత లోటు ఉంది.
- జూన్‌లో 68.2 మి.మీ. సాధారణ వర్షపాతానికి గాను 134.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. అంటే 97.8 శాతం డివియేషన్ ఉంది. ఈనెలలో బ్రహ్మంగారి మఠంలో 23 శాతం, పోరుమామిళ్ల మండలంలో 5.6 శాతం, బద్వేలు 25.1 శాతం, గోపవరంలో 39.4 శాతం, అట్లూరులో 40.7 శాతం సాధారణం కంటే తక్కువ వర్షం కురిసింది.
- జులైలో జిల్లా సాధారణ వర్షపాతం 98.5 మి.మీ.కి గాను 55 మి.మీ. నమోదైంది. ఈనెలలో బ్రహ్మంగా రిమఠం, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు, సింహాద్రిపురం, వేముల మండలాలు మినహా మిగతా 30 మండలాల్లో తీవ్ర వర్షపాతలోటు నమోదైంది. లిం గాల మండలంలో అత్యధికంగా 99 శాతం వర్షపాత లోటు ఏర్పడింది.
- ఆగస్టులో సాధారణ వర్షపాతం 120 మి.మీ.కిగాను 92 మి.మీ. కురిసింది. తొమ్మిది మండలాలు మినహా మిగతా 27 మండలాల్లో వర్షపాత లోటు నమోదైంది. గోపవరంలో అత్యధికంగా 66.6 శాతం లోటు ఏర్పడింది.
- సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 74.7 మి.మీ. కిగాను ఇప్పటివరకు 28.3 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 62.1 శాతం వర్షపాత లోటు ఏర్ప డింది. ఈనెలలో అన్ని మండలాల్లో వర్షపాత లోటు ఉండడం ఆందోళన కలిగించే పరిణామం. చక్రా యపేట మండలంలో అత్యధికంగా 85.8 శాతం లోటు నమోదైంది.

ఖరీఫ్‌లో సాగైన పంటల వివరాలు..(హెక్టార్లలో)

పంట	సాధారణ సాగు	సాగైంది..
కంది	3894	3217
వరి	31,171	13,474
పత్తి	24086	13,278
వేరుశనగ	5971	4561
జొన్న	1407	38

డ్రై స్పెల్స్ విజృంభణ

వరుసగా 21 రోజులు వర్షం పడకపోతే దాన్ని ఒక డ్రై స్పెల్‌గా పరిగణిస్తారు. కాశినాయన, పోరుమామిళ్ల, పులివెందుల, వేముల, అట్లూరు, ఒం టిమిట్టను మినహాయిస్తే మిగతా 30 మండలాల్లో డ్రై స్పెల్స్ ఏర్పడ్డాయి. మొదటి స్పెల్‌లో కొండాపురం, మైలవరం, మైదుకూరు, లింగాల, వల్లూరు మండ లాల్లో వరుసగా 42 రోజులు వర్షాలు పడలేదు. అంటే ఈ మండలాల్లో రెండేసి చొప్పున డ్రై స్పెల్స్ సంభవిం చాయి. రెండవ స్పెల్ కింద పది మండలాల్లో డ్రైస్పెల్ చోటుచేసుకున్నాయి. పెద్దముడియం మండలంలో రెండు డ్రై స్పెల్ ఏర్పడ్డాయి.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి



సుదీర్ఘ వర్షాభావం కారణంగా వేసిన పం టలు వేసినట్లే ఎండిపో యాయి. కేసీ కెనాల్ మినహా మిగతా మం డలాల్లో అంతా దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయి. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ పరిస్థి తిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలి. – ఎంవీ సుబ్బారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, ఎర్రగుంట్ల

పరిహారం అందించి ఆదుకోవాలి



నేను ఎదు ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. రెండు నెలలుగా వర్షాలు లేకపోవడంతో పైరు పూర్తిగా ఎండిపో యింది. దీంతో పంటను దున్నేశాను. విత్తనాలు, ఫాస్ఫేట్, సేద్యాలు వంటి ఖర్చు లన్నీ తడిసి మోపెడయ్యాయి. ఈ–క్రాప్ నమోదు చేసుకున్నా పరిహారం లభించలేదు. కరువుతో నష్టపోయిన మాకు పరిహారం అం దించి ఆదుకోవాలి. – టి.రామ్మోహన్‌రెడ్డి, రైతు, దిగువపల్లె కొత్తపల్లె, వల్లూరు మండలం

జిల్లాలో వర్షం



కడప ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన వర్షం నీరు

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం తెల్లవా రుజామున జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలోని గోపవరం మండలంలో అత్యధికంగా 54 మి.మీ వర్షం కురిసింది. అలాగే చెన్నూరులో 49.4, ప్రొద్దుటూరులో 39 ,కడపలో 38.2, పెద్దముడియంలో 31.8, జమ్మలమడుగులో 25.4, సీకేదిన్నెలో 20.2, బద్వేల్లో 18.8, వల్లూరులో 13.8, వీఎన్‌పల్లిలో 10.2, రాజుపాలెంలో 9.4 , మైలవరం, పెండ్లి మర్రిలో 8.4 , కొండాపురంలో 7.4 , ఖాజీపే టలో 6.4, కమలాపురంలో 3.6, అట్లూరులో 3.4 , ఎర్రగుంట్ల, బిమఠంలో 3.2 , ముద్దనూ రులో 2.6, చాపాడులో 1.4 , సింహాద్రిపురం లో 1.2 మి.మీ వర్షం కురిసింది.

కడప నగరంలో రోడ్లు జలమయం...

కడప నగరంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలతోపాటు ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు పలు రోడ్లు జలమయంగా మారాయి. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపు నీరంతా నిండి చెరు వును తలపించింది. నిలిచిన వర్షం నీటితో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



వర్షపునీటిని తోడేందుకు వచ్చిన మున్సిపల్ వాటర్ వ్యాక్యుమ్ యంత్రం

పెండ్లిమర్రికి 'మాలి' దేశీయులు



ప్రకృతి వ్యవసాయ వల్ల కలిగే లాభాల గురించి మాలి దేశస్తుల టీం సభ్యులకు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఆరా

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి మండలంలో ప్రకృతి వ్యవ సాయ పద్ధతులతో సాగు చేసే పంటల గురించి తెలుసుకోవడానికి సోమవారం మాలి దేశానికి చెం దిన హుస్సేన్‌టోలీ, లయ కన్నాయే, రామదాన్, ఆలోకిటా, మహ్మద్ సోమిరి, స్టెఫోనో,జెర్నిఫర్ ఫ్రావోస్ట్ ఏడుగురు సభ్యులు పెండ్లిమర్రి మండలా నికి వచ్చారు. వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వారికి వివరించారు. అలాగే గ్రామ సంఘాలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో చర్చించారు. అనంతరం చెన్నంరాజుపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటలను, పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు లతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చాలా ఆరోగ్యకరమని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడు లు, లాభాలు పొందవచ్చని రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అడ్మినిస్ట్రేషన్ శ్యాముల్ ఆనంద్, స్టేట్ ఎస్‌పీఎంయూ చంద్రశేఖర్,జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఏట ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టుకు భూసేకరణ

- మంటపంపల్లె – ఒంటిమిట్ట మధ్య రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్ కడప జిల్లాలోని మంటపం పల్లె – ఒంటిమిట్ట మధ్య రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిం చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు స్టేషన్ల మధ్య కి.మీ. 233/9–11 వద్ద లెవల్ క్రాసింగ్ నంబర్. 117కి బదులుగా రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మిం చాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు నిర్మాణం కోసం కావాల్సిన భూసేకరణ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం కేం ద్ర రైల్వేశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రగుంట్ల: యర్రగుంట్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అతిథి అధ్యాపకు డిగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా ప్రిన్సిపల్ కార్యాలయంలో తమ బయోడేటా సంబంధిత అర్హత పత్రాలతో సంప్రదిం చాలని కళాశాల ప్రిన్సిపల్ ఎం.రవికుమార్ సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియామకంలో ఎస్.ఈ.టీ ఎస్.ఈ.టీ, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

చోరీల కట్టడికి ప్రత్యేక బృందాలు

- ప్రధాన కూడళ్లలో నిఘా నేత్రాలు ఏర్పాటు
- రాయలసీమ డీఐజీ కోయ ప్రవీణ్

పులివెందుల రూరల్: జిల్లాలో చోరీలు అరికట్టేం దుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాయలసీమ డీఐటీ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి పులివెందుల డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో జరుగుతున్న వరుస దొంగతనా లను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ప్రణాళికలను సిద్ధం చేశారన్నారు. ఇప్పటివరకు 9పాత కేసులను ఛేధించి సుమారు రూ.5లక్షలను రికవరీ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా బయట నుంచి కొత్త వ్యక్తులు వచ్చి చోరీలకు పాల్పడుతున్నా రన్నారు. వారిని పట్టుకునేందుకు పోలీసు బం దోబస్తు ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జూదం , సారాయి, గంజాయి, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా మన్నారు. పులివెందుల డివిజన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ఆయన చర్చించారు.



మాట్లాడుతున్న రాయలసీమ డీఐజీ కోయ ప్రవీణ్

కార్యక్రమంలో డీఎస్పీ మురళీ నాయక్, సీఐలు జీవన్ గంగానాథ బాబు, రమణ, హాజీవల్లి, ఎస్ఐ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎం మిషన్‌ల చోరీలపై డీఐజీ ఆరా

కడప అర్బన్: కర్నూలు–కడప రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఏటీఎం మిషన్ల చోరీపై ఆరా తీశారు. సోమవారం కడపకు వచ్చిన ఆయన్ను ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, పోలీసు అధికారులు కలిసి స్వాగతం పలికారు. పోలీస్ గెస్ట్ హౌస్‌కు వచ్చిన ఆయనతో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలో ఏటీఎం మిషన్‌ల చోరీపై డీఐజీ ఆరా తీశారు. ప్రత్యేక బృం దాలను ఏర్పాటు చేసి త్వరగా విచారణ పూర్తి చేసి నిందితులను పట్టుకోవాలనీ పోలీసు అధికారులను ఆదేశించారు.

స్టాఫ్ నర్స్‌ల ఎదురుచూపు!

వైద్య ఆరోగ్య శాఖ జోన్–4 పరిధిలో స్టాఫ్ నర్స్ నియామకాల కొనసాగింపుపై 'పచ్చ' నీడలు కమ్ముకున్నాయి. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య రం గానికి మహర్దశ పట్టగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 'చంద్ర'గ్రహణం పట్టింది. నాడు వెల్లువలా ఉద్యోగ నియామకాలు జరిగితే..నేడు అర్హులైన వారు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూడాల్సిన దుస్థితి తలెత్తింది.

- వైద్య రంగానికి 'చంద్ర గ్రహణం'
- 100 రోజుల పాలనలో నియామకాల ఊసే ఎత్తని ప్రభుత్వం
- జాబితాలో సిద్ధంగా అర్హులైన అభ్యర్థులు



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: ఉద్యోగ నియామకాల కోసం అర్హు లైన స్టాఫ్ నర్సులు నెలల తరబడి ఎదురుచూస్తు న్నారు. కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యా లయం జోన్–4 పరిధిలో 2023 నవంబర్ నెలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండవ సారి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసిం ది. అభ్యర్థుల నుంచి 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తుల ఆధారంగా నిబంధనలు, మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జాబితాను తయారు చేశారు. ఆ జాబితా ఆధారంగానే విడత లవారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పించారు. ఆ విధంగా ఒక్కో విడతకు 100 మందికి పైగా నాలుగు విడతలుగా నియామక కౌన్సెలింగ్ చేపట్టారు.

ఎన్నికల కోడ్ ముగిసినా...: ఐదో విడతగా మదన పల్లి, పులివెందుల, ఆదోని మెడికల్ కాలేజీలకు 206 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు చేప ట్టారు. ఈ తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో ని యామక కౌన్సెలింగ్‌కు ఆటంకం ఏర్పడింది. ఎన్నిక లు ముగిశాక ఇదివరకే రూపొందించిన అభ్యర్థుల ఎంపిక జాబితాతో జూన్ మొదటి వారంలో నియా మక కౌన్సెలింగ్ నిర్వహణకు అధికారులు చర్యలు తీ సుకున్నారు. ఈ నియామకంపై కొత్తగా ఏర్పడిన తెలుగుదేశం పార్టీ నేతలు.. ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వ్యక్తులు కొర్రీలు వేశారు. దీంతో కౌన్సెలింగ్ ఆగింది. అనంతరం ఉన్నతాధికారులు తర్జన భర్జ నలు పడి ఎట్టకేలకు 5వ విడత కౌన్సెలింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ కౌన్సెలింగ్‌ను ఆగస్టు 13 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించారు.

6వ విడత కౌన్సెలింగ్‌పై అభ్యర్థుల ఆశలు..


ఈ నేపథ్యంలో జాబితాలో సిద్ధంగా ఉన్న అభ్య ర్థులు 6వ విడత కౌన్సెలింగ్‌పై గంపెడాశలు పెట్టుకు న్నారు. 6వ జాబితాను ఎప్పుడు ప్రకటిస్తారని ఆ లిస్ట్‌లో ఉన్న నిరుద్యోగులు ఆశగా అడుగుతున్నారు. అలాగే ఇది వరకే నిర్వహించిన ఐదు విడతల కౌన్సె లింగ్‌లకు దాదాపుగా మొత్తం 40 మందికి పైగా అభ్యర్థులు హజరు కాలేదు. కౌన్సెలింగ్‌కు హజరు కాలేని వారి స్థానంలో నిబంధనల ప్రకారం జాబి తాలో తరువాత స్థానంలో ఉన్న అభ్యర్థులతో భర్తీ చేయాలి. అలాగా కూడా జరగడం లేదు. అలాగే 6వ విడత కౌన్సెలింగ్‌పై కూడా ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడంలేదు. దీంతో అర్హు లైన నిరుద్యోగుల్లో ప్రభుత్వ తీరుపై ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఆ శాఖ పరిధిలోని జోన్–4 పరిధిలో మొత్తం 600 స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లుగా అధికారిక వర్గాలు అం టున్నాయి. ఎప్పటికప్పుడు స్టాఫ్ నర్స్ నియామకా లను చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందనే అభి ప్రాయాన్ని అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తే అభ్యర్థులకు వెసులుబాటు



కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు నాలాం టివారు ఎందరో దరఖాస్తు చేసు కున్నారు. ఇప్పటికీ ఐదు విడతలుగా అర్హులైన వారికి కౌన్సిలిం గ్ నిర్వహించి ఉద్యోగాలు కల్పించారు. ఆరవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తే జాబి తాలో ఉన్న ప్రకారం మిగతా వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ప్రభు త్వం, ఉన్నతాధికారులు త్వరితగతిన నియామక కౌన్సెలింగ్ నిర్వహిస్తే నిరుద్యో గులకు ప్రయోజనకరంగా మారుతుంది.
–బి జాస్మిన్ పరిమిల, జమ్మలమడుగు

నియామకాల వివరాలను ప్రభుత్వానికి పంపించాం



ఇప్పటివరకు నిబం ధనల ప్రకారం కాం ట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలను చేప ట్టాం. అందుకు సం బంధించిన వివరాలను ఇటీవలే ప్రభుత్వా నికి పంపించాం. పై అధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం..
– డాక్టర్ శ్రీనివాసులు, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం, కడప

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు

కడప అగ్రికల్చర్: ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి 'పొలం పిలుస్తోంది' కార్య క్రమం ప్రారంభమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత కార్య క్రమం వారంలో ప్రతి మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు ఉదయం ఒక గ్రామంలో సాయంత్రం ఒక గ్రామం చొప్పున క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పంటల పరిశీలించడం, గ్రామ ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామ సభ ఏర్పాటు చేసి రైతుల సమస్యలు తెలుసుకోవడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అలాగే రైతులు అడిగిన సమస్యలను పరిష్కరించే దిశగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో పాటు శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. సాగు వ్యయాన్ని తగ్గించడం, మెరుగైన సాగు పద్ధతులను అవలంబిచండం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్స హించడం, ఉత్పాదకతను పెంచడంతోపాటు రైతుల ఆదాయ స్థాయిలను పెంచడం అంతిమ లక్ష్యం అన్నారు.

ఉదయం.. సాయంత్రం

ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు క్షేత్ర సం దర్శన, 10 నుంచి 12 గంటల వరకు క్షేత్రసందర్శన పరిశీలన ఆధారంగా రైతులు, శాస్త్రవేత్తల పరస్పర చర్చా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రైతు, శాస్త్ర వేత్త పరస్పర చర్చ కార్యక్రమం, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు క్షేత్ర సందర్శన కార్య క్రమం ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

చేపల వేటను అడ్డుకున్న స్థానికులు

ముద్దనూరు : గండికోట జలాశయం నుంచి ప్రవహించే జలాల్లో స్థానికేతరులు చేపడుతున్న చేపల వేటను సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలంలోని శెట్టివారిపల్లె సమీపంలోని గాలేరు–నగరి కాలువలో, ఉప్పలూరు సమీపంలోని వామికొండ రిజర్వాయరులో పలు ప్రాంతాలవారు గత కొద్దిరోజుల నుంచి భారీగా చేపలవేటను సాగిస్తున్నారు. అయితే స్థానిక ప్రజలు చేపల వేటను అడ్డుకున్నారు. స్థానికేతరులు వచ్చి చేపలను పట్టుకోవడం, వాటిని వాహనాల్లో ఎగుమతి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

30 మద్యం బాటిళ్లు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామానికి చెందిన కమ్ముసాబ్‌గారి అబ్దుల్ రసూల్ అనే వ్యక్తి వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. సోమవారం రాజుపాళెం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు వెలవలి గ్రామంలో దాడులు చేశామన్నారు. అబ్దుల్ రసూల్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మెకానిక్ షెడ్‌లో అగ్ని ప్రమాదం


అగ్నిప్రమాదంలో కాలిపోయిన షెడ్

పోరుమామిళ్ల : పట్టణంలోని బైక్ మెకానిక్ షెడ్‌లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ. 4 లక్షల నష్టం జరిగినట్లు యజమాని తెలిపారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న బాలాజీ బైక్ మెకానిక్ షాపులో హఠాత్తుగా తలెత్తిన అగ్నిప్రమాదం కారణంగా మూడు బైకులు, నిండుగా ఉన్న ఆయిల్ క్యాన్లు, వెల్డింగ్ మిషన్లు ఇతర సామగ్రి కాలిపోయినట్లు అగ్నిమాపక అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సుబ్బయ్య, సిద్దయ్య, శ్రీనివాసులు, చెన్నకేశవ, సుహేస్‌బాషా తదితరులు మంటలు ఆర్పేందుకు కృషి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని బుద్దాయపల్లి రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివప్రసాద్ అనే వ్యక్తి గాయపడ్డాడు. కడప నగరంలోని ఓంశాంతినగర్‌కు చెందిన శివప్రసాద్ ద్విచక్రవాహనంలో బుద్దాయపల్లికి వెళుతుండగా రాజంపేట వైపు నుంచి కడపకు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శివప్రసాద్‌ను చికిత్సకోసం రిమ్స్‌కు తరలించారు.

పోలీసుల కక్ష సాధింపు!



- పులివెందుల నియోజకవర్గంలో విమర్శలకు తావిస్తున్న పోలీసుల వైఖరి
- టీడీపీ నేతల కనుసన్నల్లో పనిచేస్తున్న కొందరు ఖాకీలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల నియోజకవర్గంలో కొందరు పోలీసు అధికారుల పనితీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అదేపనిగా కొన్ని సంఘటనలలో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారనే అపవాదును మూటగట్టుకుంటున్నారు.

• చక్రాయపేట మండలం అద్దాలమర్రికి చెందిన ఈశ్వరాచారి 2022 సెప్టెంబర్ 1నుంచి కనిపించడం లేదని అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తండ్రి, భర్త కనిపించకుండా పోవడానికి అదే గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సిద్దారెడ్డిలే కారణమని ఫిర్యాదు చేసిన ఈశ్వరాచారి కుటుంబ సభ్యులు ఈ మధ్య కాలంలో ఎలాంటి సంబంధంలేని మరో ముగ్గురు వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయి నాయకులపై ఫిర్యాదు చేశారు. దీంతో వారిని ఆర్.కె. వ్యాలీ సీఐ నాగరాజు పిలిపించి సదరు ఈశ్వరయ్య ఆచూకీ తెలపమని వేధింపులకు గురి చేశారు. ఈ సంఘటనలో సంబంధం ఉన్న వారిని పిలిపించి విచారించడం మానేసి మిగతా వారిని పిలిపించి వార్నింగ్ ఇవ్వడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు.

• వేముల మండలం పెండ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేళ్ల మహేశ్వర్‌రెడ్డిపై ఇటీవల వినాయకచవితి పండుగ తరువాత పులివెందులకు వెళుతుండగా రెండు వాహనాలతో అడ్డుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. ఈ సంఘటనలో నాగేళ్ల మహేశ్వర్‌రెడ్డిపై దాడి చేసిన చంద్రవర్ధన్‌రెడ్డి, చంద్రసేనారెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, ఆందోల్‌లతో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. ఇదే సంఘటనకు సంబంధించి వైఎస్సార్‌సీపీకి చెందిన నాగేళ్ల మహేశ్వర్‌రెడ్డి, పేరం గంగిరెడ్డి, సహదేవరెడ్డిలతో పాటు మరికొంతమందిపై అనవసరంగా కౌంటర్ కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో కేవలం రాజీ చేయాలని ఆర్.కె వ్యాలీ సీఐ నాగరాజు ఒత్తిడి చేయడం గమనార్హం.

• లింగాల మండలం అంబకపల్లిలో గ్యాంబ్లింగ్ కేసులో నిందితులుగా ఉన్న 8మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు రూ.27,700 నగదును సీజ్ చేశారు. నిందితులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు అనే ఉద్దేశంతో ఈ సంఘటనలో ఎస్ఐ మధుసూదన్‌రావు కోటింగ్ ఇవ్వడంతోపాటు కోర్టుకు కూడా హాజరు పరిచారు. మరో సంఘటనలో లింగాల మండలం పార్నపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో జూదమాడుతున్న 12 మందిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించేశారు. అలాగే దాదాపు రూ. 15 లక్షల మేర నగదు దొరికితే కేవలం రూ.3,15,500ను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

• పులివెందుల పట్టణంలో మారుతీహాలు సమీపంలో ఉన్న రాజగోపాల్ రెడ్డి, అతని భార్య శ్రావణిపై దాడి చేసి పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి దాష్టీకాన్ని ప్రదర్శించారు. తన ఫోన్ కాల్ లిఫ్ట్ చేయడంలేదనే కారణంతో తెలుగు తమ్ముళ్లను ఇంటికి పంపి మరీ వారిని కొట్టుకుంటూ తీసుకుని వెళ్లారు. ఈ సంఘటనలో బాధితులు లావణ్య, ఆమె తండ్రి సుధాకర్‌రెడ్డి, చిన్నాన్న చంద్రమౌళీశ్వరరెడ్డిలతో పాటు మరో నలుగురిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఈ సంఘటనలో నిందితులపై కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారు. రాజీ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారని తెలుస్తోంది.

చెలరేగిపోతున్న దొంగలు



జిల్లాలో ఒకవైపు పులివెందుల పరిసర ప్రాంతాలలో వరుస దొంగతనాలు దోపిడీలు, కడప నగరంలో ఏటీఎం మిషన్‌లపై దుండగుల దాడులు, మైదుకూరులో నగల దుకాణంపై దోపిడీ దొంగలు బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లడంలాంటి నిత్య సంఘటనలు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. దోపిడీలు, దొంగతనాలకు పాల్పడేందుకు ప్రధాన కారణాలుగా దొంగలలో కొందరు మట్కా, గ్యాంబ్లింగ్, మద్యానికి బానిసలుగా మారడం వలననే ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. మరోవైపు జిల్లాలో దొంగలు రోజురోజుకు రెచ్చిపోతూ పోలీసు యంత్రాంగానికే సవాలు విసురుతున్నారు. పులివెందులకు గోవానుంచి అక్రమంగా మద్యాన్ని రెండు లారీలలో తీసుకుని వచ్చి ఇక్కడ విచ్చలవిడిగా విక్రయించడంపై కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రమేయం ఉందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ఏటీఎం మిషన్‌లో దోపిడీపై అన్ని కోణాల్లో దర్యాప్తు

10 పోలీసు బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు

కడప అర్బన్ : జిల్లాలో మూడు ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లలో జరిగిన దోపిడీపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. దోపిడీ గ్యాంగ్ రెండు ఏటీఎంలను పగులగొట్టి రూ. 42 లక్షల మేరకు నగదును దోచుకుని వెళ్లిన విషయం విదితమే. పక్కా స్కెచ్‌తో దోపిడీ చేసిన గ్యాంగ్ పరారైనప్పటి నుంచి జిల్లా ఎస్పీ దాదాపు 10 పోలీసు బృందాలను ఏర్పాటు చేసి అన్ని వైపులా పంపించారు. ఎప్పటికప్పుడు వారికి నేరుగా జిల్లా ఎస్పీ మార్గనిర్దేశం చేస్తున్నారు. సీసీఎస్, సైబర్, కడప ఒన్‌టౌన్ పోలీసు అధికారులు సిబ్బంది దుండగుల ఆచూకీ కోసం వేట ప్రారంభించారు. కడప నగరం ద్వారకా నగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను కేవలం 20 నిమిషాల సమయంలోనే దుండుగులు తెరిచి రూ. 6,19,300 నగదును దోచుకుని వెళ్లారు. అంతే సమయంలో ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ పక్కనున్న ఏటీఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌ల ద్వారా తెరవడం, బ్లాక్ స్ప్రేను ఉపయోగించి సీసీ కెమెరాల పుటేజీల ద్వారా మనుషుల ఆచూకీ కనపడనీయకుండా జాగ్రత్త పడ్డారు. ఈ మిషన్ నుంచి రూ.36,11,400ల నగదును దోచుకుని వెళ్లారు. 2021 డిసెంబర్‌లో జరిగిన ఎస్‌బీఐ ఏటీఎంల చోరీల కేసులో కేవలం నాలుగైదు రోజుల్లోనే హర్యానా మేవాత్ గ్యాంగ్ ఆటకట్టించగలిగారు. ప్రస్తుతం ఈ రెండు ఏటీఎం మిషన్‌ల చోరీలకు పాల్పడిన వారు కూడా హర్యానా మేవాత్ గ్యాంగ్ పనే అని ప్రాథమికంగా భావిస్తున్న పోలీసులు ఆ దిశగా కూడా పోలీసు బృందాలను ఇప్పటికే పంపించారు. దోపిడీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దోపిడీలు జరగకుండా పోలీసులు, బ్యాంక్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీలో భద్రత పటిష్టం

ట్రిపుల్ ఐటీ ఏఓ రవికుమార్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగుల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్ కుమార స్వామి గుప్తా ఆదేశాల మేరకు సెక్యూరిటీ అధికారి, సూపర్‌వైజర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటి వ్యక్తులు ఇకనుంచి క్యాంపస్‌లోకి రావాలంటే అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అలాగే క్యాంటీన్లు, మెస్‌లలో పనిచేస్తున్న వారు సెక్యూరిటీ ప్రధాన ద్వారం వద్ద బయోమెట్రిక్ వేసి రావాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారికి ఇచ్చిన పేరెంట్ ఐడీ కార్డు, నివాసిత ఉద్యోగుల తల్లిదండ్రులు, బంధువులు ఆయా ఉద్యోగులతో ఫోన్ ద్వారా ధ్రువీకరించిన తర్వాత మాత్రమే అనుమతించాలని సెక్యూరిటీ గార్డులకు ఏఓ ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సెక్యూరిటీ ఆఫీసర్ శరవన్ కుమార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో దంపతులకు జైలు శిక్ష

కడప అర్బన్ : చీటీల పేరుతో మోసగించిన కేసులో భార్యాభర్తలకు కోర్టు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా..కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్కాయపల్లిలో 2020 నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా సరితాల రషీదాబాను, ఆమె భర్త సరిటాల బాబాఫక్రుద్దీన్‌లు మౌని చిట్స్ పేరుతో చిట్స్ నడుపుతూ వచ్చారు. ఈ క్రమంలో లక్కిరెడ్డి తులశమ్మ, ఇంకా కొంతమంది వీరికి చిట్స్ రూపంలో డబ్బులను చెల్లించారు. ఆ డబ్బులను బాధితులకు చెల్లించక పోవడంతో కడప తాలూకా పరిధిలో గత ఏడాది కేసు ఎస్ఐ తయార్ హుసేన్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్ భార్యాభర్తలైన సరిటాల రషీదాబాను, ఆమె భర్త సరిటాల బాబాఫక్రుద్దీన్‌లకు రెండున్నర సంవత్సరాల జైలు శిక్షతో పాటు, ఇద్దరికీ కలిపి రూ. 4000 జరిమాన విధించారు. ఈ కేసును ఏపీపీ శేషయ్య వాదించారు. కేసులో శిక్ష పడేలా కృషి చేసిన కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ డి.తయార్ హుసేన్, కోర్టు కానిస్టేబుళ్లు ఎం. రఘురాముడు, డి.పుల్లయ్య, కోర్టు మానిటరింగ్ సెల్ కె. సుబ్బరాయుడులను జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, కడప డీఎస్పీ ఎస్. రమాకాంత్ అభినందించారు.

పాలసీదారుల సేవలను మెరుగుపరచాలి


నూతన కమిటీతో ఎల్ఐసీ యూనియన్ నాయకులు

కడప కల్చరల్ : బీమా రంగంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మార్పుల నేపథ్యంలో పాలసీదారుల సేవలను మరింత మెరుగుపరిచి వారితో బంధాన్ని పెంచుకుని సంస్థ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి జి.తిరుపతయ్య అన్నారు.సోమవారం కడప నగరంలో జరిగిన డివిజన్ యూనియన్ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.పర్మినెంట్ ఉద్యోగాలకు బదులు అప్రెంటీసు నియామకాలంటే శ్రమదోపిడికి అవకాశం ఇవ్వడమేనని తెలిపారు. మహాసభల్లో కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోశాధికారి ఆర్.శ్రీనివాసన్, సంఘాల ప్రతినిధులు చంద్రపాల్, రామాంజనేయులు, సుధీకర్, కామనూరు శ్రీనివాసుల రెడ్డి, అజీజ్, హరి, సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు.

నూతన కార్యవర్గం

ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా అవధానం శ్రీనివాస్ (కడప), ఉపాధ్యక్షులుగా పి.అయ్యవారు రెడ్డి (కడప) వై.కళ్యాణ్ (రాయచోటి), కేపీ సూరిబాబు (అనంతపురం), పీఎస్ రవిబాబు (ఆదోని), ప్రధాన కార్యదర్శిగా ఎ.రఘునాథరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జి.వారిజాతమ్మ (కడప). కేసీఎస్ రాజు (కడప), ఎస్ శ్రీనివాసులు (కదిరి), ఆర్. సునీయకుమార్ (కర్నూలు), కోశాధికారిగా అమీనాపర్వీన్ (కడప), సహాయ కోశాధికారిగా పి రత్నకిషోర్ (కడప), జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా అక్బర్ బాషా (కడప)లు ఎన్నికయ్యారు.

తాగునీటి మోటారు తీగలు చోరీ

ముద్దనూరు : ముద్దనూరు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటిని సరఫరా చేసే మోటారు బోరు తీగలు చోరీకి గురయ్యాయి. స్థానిక సాయినగర్ కాలనీలో ఉండే రెండు తాగునీటి బోర్ల మోటారుకు ఉండే తీగలను ఆదివారం రాత్రి దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో కాలనీ వాసులకు సోమవారం తాగునీటి సరఫరా లేక ఇబ్బందుల పాలయ్యారు. గ్రామ పంచాయతీకి చెందిన మోటార్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతం వారంలో కూడా 3 మోటార్ల తీగలను చోరీ చేశారు.

8 మందిపై బైండోవర్ కేసులు నమోదు

వేంపల్లి : ట్రిపుల్ ఐటీలోకి అక్రమంగా ప్రవేశించిన 8 మంది టీడీపీ కార్యకర్తలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు తెలిపారు. గత శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లోనికి టీడీపీ కార్యకర్తలు మూడు వాహనాల్లో వెళ్లి అక్కడ ఉన్న క్యాంటీన్, సూపర్ మార్కెట్ల యజమానులతో దురుసుగా ప్రవర్తించడంతో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. క్యాంపస్‌లోకి అనుమతి లేకుండా ఎవరు కూడా లోనికి రాకూడదని హెచ్చరించారు. మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. క్యాంపస్ ప్రధాన ద్వారం నుంచి కొత్త వ్యక్తులు లోనికి వచ్చినట్లయితే అక్కడ పనిచేసే సెక్యూరిటీ గార్డులు తమకు తెలియజేయాలన్నారు.

మరణిస్తూ మంచిపని!

దేహాన్ని దానం చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త నరసింహారెడ్డి




కదిరి అర్బన్ : ఆయనో వ్యవసాయ శాస్త్రవేత్త. ఉద్యోగంలో ఉన్నన్ని రోజులూ నూతన వంగడాలు కనిపెడుతూ రైతుకు, సమాజానికి ఎంతో ఉపయోగపడ్డారు. పదవీ విరమణ తర్వాత కూడా నిత్యం సమాజం గురించే ఆలోచించేవారు. చివరకు తన ప్రాణం పోయినా ఎందరో మెడికల్ విద్యార్థులకు మేలు జరిగేలా తన దేహాన్ని దానం చేశారు. ఆయనే కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా (1999) పని చేసిన డాక్టర్ పూదూరు నరసింహారెడ్డి(86). వయస్సు మీద పడటంతో సోమవారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో నరసింహారెడ్డి మృతి చెందారు. ఆయన బతికి ఉన్నప్పుడే మరణానంతరం తన శరీరాన్ని దానం చేయాలని కుటుంబీకులకు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం కడప రిమ్స్ ఆస్పత్రికి అప్పగించారు. ఇందుకు ఆయన భార్య లీలావతి కూడా పూర్తిగా అనుమతించారు.

విత్తన వేరుశనగ రకాల సృష్టికర్త

నరసింహారెడ్డి 1987లో కదిరి అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో బ్రీడర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1995లో ప్రిన్సిపల్ సైంటిస్టుగా పదోన్నతి పొందారు. ఆయన ఆధ్వర్యంలో 1993లో జేఎల్24 రకాలను సంకరపరచి 'వేమన' అనే కొత్త రకం వంగడాన్ని ఉత్పత్తి చేశారు. అలాగే కదిరి–4 అనే రకం విత్తన వేరుశనగను కూడా అభివృద్ధి చేశారు. ఈ రెండు వంగడాలు రైతులకు లాభసాటిగా మారాయి.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం

వేంపల్లె : మండలంలోని అలిరెడ్డిపల్లె ఫారెస్ట్ సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వేంపల్లి ఫారెస్ట్ రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం అందిన సమాచారం మేరకు అలిరెడ్డిపల్లె ఫారెస్ట్ సమీపంలో తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 13 ఎర్రచందనం దుంగలు మాత్రమే దొరికాయన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు రేంజర్ తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ఎక్కడైనా ఎర్రచందనం దుంగలను తరలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



సిద్దవటం : మండలంలోని భాకరాపేట– సిద్దవటం మార్గంలో అయ్యప్ప స్వామి గుడి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(40) మృతి చెందారని సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. భాకరాపేట వైపు నుంచి సిద్దవటం వైపు ద్విచక్రవాహనంలో సోమవారం ఒక వ్యక్తి అతి వేగంగా ప్రయాణించాడన్నారు. భాకరాపేట, సిద్దవటం ప్రధాన రహదారిలోని అయ్యప్ప స్వామి గుడి సమీపంలోకి రాగానే మోరీని ఢీకొని కల్వర్టులో పడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మృతుని వివరాల కోసం విచారిస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రొద్దుటూరులో పట్ట పగలే చైన్ స్నాచింగ్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని జిన్నారోడ్డులో పట్టపగలే చైన్ స్నాచింగ్ జరిగింది. అందరూ చూస్తుండగానే గుర్తు తెలియని దుండగుడు వృద్ధురాలి మెడలో నుంచి బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. గండికోట నాగమునెమ్మ జిన్నారోడ్డులో నివాసం ఉంటోంది. కూరగాయలు తెచ్చుకునేందుకు ఆమె సోమవారం ఉదయం 9.45 సమయంలో జిన్నారోడ్డులోకి వచ్చింది. ఈ క్రమంలో కూరగాయలు తీసుకొని ఇంటికి వెళ్తుండగా ఒక వ్యక్తి వెనుక వైపు నుంచి బైక్‌లో వచ్చి ఆమె మెడలోని బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. దుండగుడు చైన్ లాగే క్రమంలో నాగమునెమ్మ కింద పడి కాలుకు గాయమైంది. దొంగ అంటూ ఆమె గట్టిగా కేకలు వేసేలోపే అతను వేగంగా బైక్‌లో పారిపోయాడు. చైన్ స్నాచర్ తలకు నల్లటోపి పెట్టుకోవడంతో పాటు ముఖానికి మాస్క్ ధరించి యూనికాన్ బైక్‌లో వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అతను బైక్‌లో వేగంగా శివాలయం సెంటర్, కొర్రపాడు రోడ్డు మీదుగా వెళ్లినట్లు తెలుస్తోంది. దొంగ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. కాగా పట్టపగలే ఇలా చైన్ స్నాచింగ్ జరగడం పట్ల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండున్నర తులం బంగారు చైన్ చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

సీజర్ రాజా ఎన్‌కౌంటర్

– కడపలో అదుపులోకి తీసుకున్న తమిళనాడు పోలీసులు


సీజర్ రాజా (ఫైల్)

కడప అర్బన్ : తమిళనాడుకు చెందిన సీజర్ రాజా అలియాస్ రాజాను సోమవారం చెన్నైలోని వెలంబేరిలో తమిళనాడు పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజా అలియాస్ సీజర్ రాజా ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో వాహనాలను సీజ్ చేసే పని చేసేవాడు. తరువాత రౌడీగా ఎదిగి దౌర్జన్యాలకు పాల్పడేవాడు. ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో దాదాపు 40 కేసులున్నాయి. ఇటీవల బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో సీజర్ రాజా 29 మంది నిందితులలో ఒకడు. కాగా హత్య జరిగిన తరువాత సీజర్ రాజా కడప జిల్లాలో తలదాచుకున్నాడు. తమిళనాడు పోలీసులు ప్రత్యేకంగా కడపకు వచ్చి అతన్ని అదుపులోకి తీసుకుని వెళ్లారు. సోమవారం అతడిని ఎన్‌కౌంటర్ చేశారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని శెట్టిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి(42) రైలు కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

బంగారు దుకాణంలో చోరీ


చోరీ జరిగిన దుకాణంలో పరిశీలిస్తున్న క్లూస్ టీం

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో మిట్టా జ్యువెలర్స్ దుకాణంలో బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగినట్లుగా భావిస్తున్న ఈ సంఘటనకు సంబంధించి అర్బన్ సీఐ సయ్యద్ హాషం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బద్వేలు రోడ్డుకు చెందిన మిట్టా సురేష్ బాబు కొన్నేళ్లుగా అదే రోడ్డులో మిట్టా జ్యువెలర్స్ పేరుతో బంగారు దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం అతను భార్యతో కలిసి వ్యక్తిగత పనిపై చెన్నై వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి వచ్చి దుకాణాన్ని తెరిచేందుకు షట్టర్ తీయగా లోపల వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటం గమనించారు. చోరీ జరిగినట్టు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, అర్బన్ సీఐ సయ్యద్ హాషం చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలించారు. చోరీ జరిగిన దుకాణాన్ని క్లూస్ టీం సభ్యులు పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. ఆరు గదులున్న ఆ ఇంటిలో దుకాణం యజమాని సురేష్ బాబు నివాసం కూడా ఉంటున్నారు. దుండగులు ఇంటిపై నుంచి రెండో గదిలోకి ప్రవేశించి ఆ గది గోడకు కన్నం వేశారు. కన్నం నుంచి జ్యువెలరీ దుకాణం నిర్వహిస్తున్న గదిలోకి చొరబడి రూ.12లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అయితే దుకాణంలో ఇంకా కొన్ని బంగారు, వెండి ఆభరణాలను దుండగులు చోరీ చేయకుండా వదిలేయడం చర్చనీయాంశంగా మారింది. సంఘటనపై బాధితుడు సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ చోరీకి సంబంధించిన ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక టీంలను వేసి దర్యాప్తు చేస్తున్నట్టు అర్బన్ సీఐ హాసం తెలిపారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి మృతి


మహబూబ్ బాషా (ఫైల్)


దస్తగిరి (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధిలో జరిగిన రెండు వేర్వేరు సంఘటనల్లోఇద్దరు యువకులు మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఎస్ఐ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో ఈ నెల 21వ తేదీ వివాహం జరిగింది. దీంతో గ్రామానికి చెందిన షేక్. మహబుబ్‌బాషా (32) మరో ముగ్గురు స్నేహితులు కలసి మద్యం సేవించడానికి పెన్నానదిలోకి వెళ్లారు. ముగ్గురు స్నేహితులు ఇంటికి రాగా మహబుబ్ బాషా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రెండు రోజులుగా గాలించినా ఆచూకీ లభించలేదు. చివరకు సోమవారం పెన్నానదిలో మృతదేహం లభించింది. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి అబ్దుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే గూడెంచెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీలో కాపురం ఉంటున్న దస్తగిరి (40) అనే యువకుడు మద్యానికి బానిస అయ్యాడు. దీంతో అప్పులు ఎక్కువై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.